క్లుప్తంగా

జీపీ సిబ్బంది వినూత్న ప్రచారం

శంకరపట్నం: మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న షాపులు, టేలాలను చిరువ్యాపారులు తొలగించాలని కోరుతూ శుక్రవారం మైక్‌ద్వారా జీపీ సిబ్బంది ప్రచారం చేశారు. ఆదివారంలోపు తొలగించకుంటే అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సైదాపూర్: మండలంలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి నర్సింగోజు నర్సయ్య ఇటీవల మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వెంట సీపీఐ జిల్లా సభ్యుడు బత్తుల బాబు, ఎగ్లాస్‌పూర్ మాజీ సర్పంచ్ కొత్త రాజిరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, గుండేటి వాసుదేవ్, హుస్సేన్ ఉన్నారు.

ఫర్టిలైజర్ షాపులో చోరీ

శంకరపట్నం: మండల కేంద్రంలోని గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపులో గురువారం రాత్రి చోరీ జరిగింది. శుక్రవారం ఉదయం తాళం పగుల గొట్టి ఉండటంతో దుకాణదారుడు సతీష్ కేశవపట్నం పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు క్లూస్ టీంతో నమూనాలు సేకరించారు. లాకర్‌లోని రూ.38,476 నగదు, రూ.46వేల విలువ గల క్రిమిసంహారక మందులను దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట: మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మున్సిపల్ పరిధి ధర్మారం వద్ద గండ్రపల్లి గ్రామానికి చెందిన గాదె మల్లేశ్, డ్రైవర్ రావుల కుమార్, మున్సిపల్ పరిధి కొత్తపల్లి వద్ద తనుగుల గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్, పైడిపల్లి శ్రీనివాస్, డ్రైవర్లు నిమ్మకాయల ధనుష్, పైడిపల్లి అరవింద్ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

కేసు నమోదు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి శివారులో గ్రామానికి చెందిన ఒగ్గు రమేశ్ అనే వ్యక్తికి సంబంధించిన ఏడుగుంటల భూమిని తిరునహరి చంద్రకళ అనే మహిళ కొనుగోలు చేసింది. ఆ భూమిని మండలంలోని కోరపల్లి గ్రామానికి కందికట్ల మధుసూదన్ అనే వ్యక్తి లీజుకు తీసుకొని ఫెన్సింగ్, హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. హద్దులు, ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసి రూ.యాభైవేల నష్టం కలిగించాడని రమేశ్‌పై మధుసూదన్ ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.

మహిళను ఢీకొట్టిన కారు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన పల్లె రజితను కారు ఢీకొనడంతో తీవ్రగాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం పనుల నిమిత్తం వ్యవసాయబావి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా భర్త కోసం రోడ్డు పక్కన నిల్చొగా కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. వెంటనే 108 వాహనంలో ఆసుపత్రికి తరలించామని తెలిపారు.

నాయకుల ముందస్తు అరెస్టు

మానకొండూర్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ మొండి వైఖరి అవలంబిస్తుందని శుక్రవారం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలో చేపట్టే ధర్నాకు వెళ్లకుండా మండల కేంద్రంలో బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈసందర్భంగా బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రదీప్ మాట్లాడుతూ... ఉద్యమాలను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్న అధికార పార్టీకి తగిన బుద్ధి చెప్తామన్నారు. ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసేంత వరకు నిరుద్యోగుల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్టయినవారిలో వరప్రసాద్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని వివిధ ఆర్గనైజేషన్లకు చెందిన నాయకులు హైదారాబాద్‌లోని టీజీపీఎస్సీ ఎదుట శుక్రవారం ఆందోళనకు తరలివెళ్తారనే సమాచారంతో గురువారం అర్ధరాత్రి పలువురిని ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు. ఈసందర్భంగా ఆర్గనైజేషన్ నాయకులు మాట్లాడుతూ.. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలేదన్నారు. అరెస్టయినవారిలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు రాములు, బీఆర్ఎస్వీ టౌన్ అధ్యక్షుడు నరేశ్, సామాజిక కార్యకర్త సాయిరాం, వెంకటేశ్, గణపతిరెడ్డి, కరంకొండ శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వీణవంక: మండలంలోని విద్యార్థి సంఘం నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. టీజీపీఎస్సీ కార్యాలయం ముట్టడికి తరలి వెళ్తున్నారనే సమాచారం మేరకు గురువారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నామని అన్నారు. అరెస్టయినవారిలో బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు ఆవుల తిరుపతి యాదవ్, అప్పని హరీశ్‌వర్మ, రాపర్తి అఖిల్‌గౌడ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ ఉన్నారు.

‘గవర్నమెంట్’పై ఆసక్తి కరువు

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన పిల్లల నమోదు
- ఆసక్తి చూపని తల్లిదండ్రులు



ఖాదర్‌గూడెం ప్రభుత్వ పాఠశాలలో బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

మానకొండూర్: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అంతేకాకుండా మనఊరు మనబడి పథకం కింద చాలా పాఠశాలలను బాగు చేయించింది. ఈ ప్రభుత్వం కూడా అంతే శ్రద్ధ తీసుకుని, అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ప్రభుత్వ బడుల్లో అనేక మౌలిక వసతుల కల్పన, మరమ్మతు పనులు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలలు మూత పడకుండా, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నా విద్యార్థుల సంఖ్య తగ్గుతుండటం పట్ల విస్మయం వ్యక్తం అవుతోంది. ఇంగ్లిష్ బోధన, అన్నిరకాల వసతులు, ఉచితంగా దుస్తులు, బుక్స్ అందజేస్తున్నా, మధ్యాహ్న భోజనం వంటివి అమలు చేస్తున్నా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. దీంతో రానున్నకాలంలో ప్రభుత్వ పాఠశాలలు మూత పడనున్నాయా అనే సందేహం వ్యక్తమవుతోంది.

- గతంతో పోల్చితే ప్రభుత్వ పాఠశాలలు చాలా మెరుగయ్యాయనే చెప్పాలి. తాగునీటి వసతి, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల నిర్వహణ, కొత్త బిల్డింగులు, ఫ్యాన్లు, ఫర్నిచర్ వంటి వసతులతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, గ్రంథాలయాలు, కంప్యూటర్ విద్య, రెండు జతల దుస్తులను ప్రభుత్వం అందజేస్తుంది. విద్యార్థుల బోధనకు అనుగుణంగా ఉపాధాయుల సంఖ్య, అంతేకాకుండా ఊరిలోనే స్కూల్ అయినా విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుంది, ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం లేదా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి.
- మండలంలో ప్రాథమిక పాఠశాలలు 42, ప్రాథమికోన్నత పాఠశాలలు 3, ఉన్నత పాఠశాలలు 12, కేజీబీవీ, మోడల్, గురుకుల పాఠశాలలున్నాయి. మోడల్, గురుకుల పాఠశాలలు, కేజీబీవీ మినహా మిగితా పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం పిల్లలను నమోదు చేసుకోవడానికి ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినా పిల్లల నమోదు మాత్రం అంతగా పెరగలేదు.

గ్రామం	విద్యార్థులు	ఉపాధ్యాయులు
గంగిపల్లి	9	2
ఖాదర్‌గూడెం	10	2
లక్ష్మీపూర్	3	1
లక్ష్మీపూర్	6	2
మానకొండూర్ ఎస్సీ కాలనీ	10	2
నిజాయితీగూడెం	7	2
శంశాబాద్	11	2
బంజరుపల్లె	5	2

- విద్యార్థులకు మెరుగైన ఇంగ్లిష్ బోధన అందించేందుకు ఉపాధ్యాయులందరికీ గతేడాది శిక్షణ ఇచ్చారు. ఆంగ్లంలో విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ఆంగ్లంలోనే మాట్లాడటం వంటి అనేక రకాల మెలుకువలను శిక్షణలో ఇచ్చారు. కానీ ఉపాధ్యాయులు విద్యార్థులతో తెలుగులోనే మాట్లాడటం, ఇంగ్లిష్‌లో మాట్లాడటం లేదని, విద్యార్థుల తల్లిదండ్రుల్లో అపోహలున్నాయి. పాఠశాల ఆవరణలోనే కాకుండా క్లాస్‌రూంలో కూడా తెలుగులోనే ఉపాధ్యాయులు మాట్లాడటం మూలంగా విద్యార్థులకు ఇంగ్లిష్‌పై పట్టు కుదరడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను తీర్చిదిద్ది ప్రభుత్వ పాఠశాలలే బెటర్ అనే స్థితికి తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని తల్లిదండ్రులు, గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతున్నా మెరుగైన వసతులున్నా ఇంకా ప్రైవేటు స్కూళ్లపైనే మొగ్గు చూపుతున్నారని, అందుకే పిల్లల నమోదు తగ్గిపోయినట్లుగా ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ, కమిషనర్ నాగరాజు, తదితరులు

చొప్పదండి: సెంట్రల్ లైటింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అధికారులకు సూచించారు. సెంట్రల్ లైటింగ్ పనులపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చొప్పదండి పురపాలక సంఘ పరిధిలోని సిద్దార్థ స్కూల్ నుంచి నవోదయ విద్యాలయం వరకు డివైడర్ నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు పనులు ప్రారంభించగా ఇటీవల నిలిచిపోయాయి. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పనుల్లో జాప్యాన్ని నివారించాలని అధికారులను కోరారు. పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ సంపత్‌రావు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, తదితరులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ భూమారెడ్డి, కౌన్సిలర్లు అశోక్, మహేశ్, నాయకులు మహేశుని మల్లేశం, పెరుమాండ్ల గంగయ్య, నలుమాచు రామక్రిష్ణ, దండె కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రాగంపేటలో మొక్కలు నాటిన రైతులు



మొక్కలు నాటుతున్న రైతులు

చొప్పదండి: మండలంలోని రాగంపేట గ్రామంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకొని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడారు. ఒక దేశంలో రెండు రాజ్యాంగాలు ఉండకూడదని ఆయన చేసిన పోరాటమే ఆర్టికల్ 370 రద్దు అని, ప్రభుత్వం పండ్లు, పూలమొక్కలను కూడా సరఫరా చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గోపు దామోదర్‌రెడ్డి, ధర్మారెడ్డి, నారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తిరుపతిగౌడ్, రాములు, వెంకటేశ్, రాజయ్య, మల్లారెడ్డి, చందు, రమేశ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో వాకర్స్ కోసం ప్రత్యేక ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం మార్నింగ్ వాక్‌లో భాగంగా వాకర్స్‌తో మాట్లాడారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు డ్రైనేజీ, లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.



వాకర్స్‌తో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలీలో ఈనెల 7న జరుగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్ పోటీలకు కరీంనగర్‌లోని సిద్ధార్థ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో 300 మీటర్ల రన్నింగ్‌లో దైవాన్షి, జి. సాక్షర, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో డి. అన్విత రెడ్డి రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

బిల్లులు ఇప్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న జగన్మోహన్‌గౌడ్

రామడుగు: ప్రభుత్వ పాఠశాలల్లో మనఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఇప్పించాలని మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్‌కు శుక్రవారం మాజీ సర్పంచ్ పంజాల జగన్మోహన్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. రామడుగు ప్రభుత్వ పాఠశాలలో పనులు పూర్తి చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీ పెరుగుతోందని వాపోయారు. దాదాపు రూ. పదకొండు లక్షలకుపైగా బిల్లులు రావాల్సి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. తక్షణం బిల్లులు ఇప్పించాలని ఎంఈవోకు మొరపెట్టుకున్నాడు.

తుమ్మల నాగరాజుకు డాక్టరేట్



గంగాధర: మండలంలోని కొండాయిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు తుమ్మల అనే యువకుడు ఉస్మానియా యూనివర్సిటి నుంచి డాక్టరేట్ సాధించాడు. మైనింగ్ ఏరియా కారణంగా క్షీణిత ప్రాంతాన్ని అంచనా వేయడంపై ప్రొఫెసర్ నర్సింగరావు, జియాలజీ డిపార్ట్‌మెంట్ నేతృత్వంలో హైపర్‌స్పెక్ట్రల్ శాటిలైట్ డేటాను ఉపయోగించి పరిశోధన చేసినట్లు నాగరాజు తెలిపారు. ఇలాంటి రీసెర్చ్ ప్రాజెక్టులు భవిష్యత్ ప్లానింగ్ కోసం నాసా, ఇస్రో, మైనింగ్ మినరల్స్, వ్యవసాయం, ఎన్విరాన్‌మెంటల్ డిపార్ట్‌మెంట్‌లకు ఉపయోగపడుతాయన్నారు. డాక్టరేట్ సాధించిన యువకుడిని గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.

నవోదయలో సీటు



రిషికను అభినందిస్తున కరస్పాండెంట్ మునీందర్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట అక్షర పాఠశాల విద్యార్థి కోరె రిషిక 2024–25 విద్యా సంవత్సరానికి నవోదయలో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ మినుకుల మునీందర్ తెలిపారు. ఈసందర్భంగా రిషికను శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ మునీందర్, డైరెక్టర్ రాధ, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఉపాధ్యాయులకు సన్మానం





టీచర్లను సన్మానిస్తున్న ఎంఈవో వేణుకుమార్, గ్రామస్తులు, చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో...

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట కొల్లారిపల్లి పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు మండల ప్రేమ్‌చంద్రారెడ్డి, సుధారాణి బదిలీపై వెళ్తుండటంతో శుక్రవారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన మండల విద్యాధికారి వేణుకుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడికి ఉద్యోగరీత్యా బదిలీలు తప్పవని, పాఠశాలలో పనిచేసిన తీరుతోనే ఉపాధ్యాయులకు గుర్తింపువస్తుందన్నారు.

చిగురుమామిడి: మండలంలోని బొమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో రెండేళ్లుగా హెచ్‌ఎంగా పనిచేసిన రాజమౌళి చొప్పదండి మండలం ఆర్నకొండ జెడ్పీపాఠశాలకు బదిలీ అయ్యారు. సోషల్ టీచర్‌గా పనిచేసిన శంకరమ్మ మానకొండూర్ మండలం వెల్ది పాఠశాలకు బదిలీ కాగా ఇదే పాఠశాలలో పీఈటీగా పనిచేసిన ప్రతిమ పదోన్నతిపై వెక్కెపల్లి జెడ్పీఎస్‌కు పీడీగా బదిలీ అయ్యారు. ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాలు కప్పి పూలమాలలతో సన్మానించారు.

ఆటపాటలతో చిన్నారులకు విద్య



మాట్లాడుతున్న అంగన్‌వాడీ బూస రేణుక

మానకొండూర్: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో విద్య అందించడం జరుగుతుందని ఖాదర్‌గూడెం అంగన్‌వాడీ టీచర్ బూస రేణుక అన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. జాతీయ విద్యావిధానం ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా చేశారని, ఆటపాటలతో విద్య, భాషా, శారీరక, సృజనాత్మకత, తదితర విషయాలను తెలియజేశారు.

స్కూళ్లలోని సమస్యలు పరిష్కరించండి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మచ్చ రమేశ్

రామడుగు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. మండలంలోని గుండి పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, స్కావెంజర్, అటెండర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పొన్నం భాస్కర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంబేడ్కర్ యువజన, బీసీ సంఘాల నాయకులు

చిగురుమామిడి: మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన, బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. మాజీ జెడ్పీటీసీలపై అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని హుస్నాబాద్–కరీంనగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బెజ్జంకి అంజయ్య, బోయిని వంశీకృష్ణ, జక్కుల బాబు, చెరుకు సంజీవ్, ఠాకూర్ రాణాప్రతాప్ సింగ్, గట్టు శ్రీనివాస్, పెసరి శ్రీనివాస్, దొబ్బల బాబు, వెంకటేశ్, గండి రమేశ్, కూరెల్ల కిషోర్, రంజిత్, కూన భిక్షపతి పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ తమ్మిశెట్టి వినోద్‌కుమార్

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ తమ్మిశెట్టి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని కందుగుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనార్థలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చెడు అలవాట్లతో జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

జీవాలకు టీకాలు

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో శుక్రవారం పశువైద్యాధికారి మాధవరావు గొర్రెలకు, మేకలకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. జీవాలకు ముందస్తుగా టీకా వేయించాలని గొర్రె కాపరులకు సూచించారు.